నవతెలంగాణ

ఆదిలాబాద్

ఆదివారం | సెప్టెంబర్ 22, 2024 | www.navatelangana.com

గద్దర్ సంస్మరణ సభ పోస్టర్లు ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన మహాగాయకుడు ప్రజాకవి గద్దర్ అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కొనియాడారు. ఈ నెల 22న పట్టణంలో నిర్వహించే గద్దర్ సంస్మరణ సభ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గద్దర్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరారు. తన పాట ద్వారా తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతులను చేసి రాష్ట్ర సాధనలో తన వంతు పాత్రను గద్దర్ పోషించారని అన్నారు. ఈ నెల 22న గద్దర్‌తో పాటు సియాసత్ ఎడిటర్ సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్మరణ సభ నిర్వాహకులు సొగల సుదర్శన్, చిక్కాల దత్తు, అర్బాత్‌ఖాన్ పాల్గొన్నారు.



ప్రేంసాగర్‌రావు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు విశ్వప్రసాద్ ఇంటి వద్ద పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రేంసాగర్‌రావు కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారన్నారు. ఆయన చేసిన సేవలను ఇప్పటికే అధిష్టానం గుర్తించిందని, మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మునీర్, గాదవేణి మల్లేష్, అసద్, అబ్దుల్లా, వసంతరావు, ఖలీమ్, దత్తు, వైరాగడ ప్రతాప్ పాల్గొన్నారు.



పిడుగుపాటుతో యువ కూలీ మృతి

నవతెలంగాణ-బేల

మండలంలోని సిర్సన్న గ్రామంలో శనివారం పిడుగుపడి కూలీ రాథోడ్ అవినాష్(18) మృతి చెందాడు. పొలంలో పనికి వెళ్లగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.



అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న లాడ్జ్‌లు సీజ్

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో అసంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న రెండు లాడ్జిలను శనివారం సీజ్ చేసినట్లు పట్టణ సీఐ ఆర్ బన్సీలాల్ తెలిపారు. జిల్లా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, మంచిర్యాల ఆర్డీఓ ఆదేశాల మేరకు మంచిర్యాల తహసీల్దార్‌తో కలిసి పట్టణంలోని సాయినాథ్ రెసిడెన్సీ, వెంకటేశ్వర లాడ్జిలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇటీవల ఈ రెండు లాడ్జిల్లో అసంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేయగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విచారణ లో తెలిందని, విటులతో పాటు లాడ్జ్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అయినప్పటికీ పద్ధతి మార్చుకోకుండా అవే అసంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న తరుణం లో ఇట్టి రెండు లాడ్జిలను సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టణంలో ఏవైనా లాడ్జిలు, గృహ నివాసలాలో ఇలాంటి అసంఘిక కార్యకలపాలు నిర్వహించినట్లయితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ - తిర్యాణి

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు హనుమండ్ల శంకర్ అన్నారు. శుక్రవారం లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి దశ మలిదశ ఉద్యమంలో కీలక భూమిక పోషించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం తన చేనేత జౌళి శాఖ మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం జీవితకాలం పోరాడిన తొలితరం ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. జిల్లా కేంద్రంలో బాపూజీ కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా కార్యదర్శులు అంకం గౌరయ్య, వాసాల సత్యనారాయణ, సంఘం సభ్యులు గాయంగి మల్లేష్, అన్నం వెంకన్న, గాడిపెల్లి అంజయ్య, అన్నం రాజేష్, గుండ అశోక్, మ్యాన రాములు, రాజు, గాయంగి తిరుపతి, బోగి వెంకటేష్, బింగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోను వెంటనే సవరించాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో లోపభూయిష్టంగా ఉందని, దాన్ని వెంటనే రద్దుచేసి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అనుకూలంగా తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేటట్టు చూడాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగితేనే బోధన సులభతరం అవుతుందనేది నిజమే కానీ ఎఫ్ఎల్ఎన్ అమలవుతున్న ప్రస్తుత కాలంలో ప్రపంచంతో పోటీ పడాలంటే హైస్కూల్స్‌లో మాదిరిగానే ప్రతి తరగతికి ఒక టీచర్‌ను ఇవ్వాలని పేర్కొన్నారు. అలా కుదరని పక్షంలో కనీసం 1 నుండి10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని చొప్పున రేషియో ప్రకారం ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో ప్రాథమిక పాఠశాలల మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

పేకాట ఆడుతున్న ఏడుగురు బైండోవర్

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని సరండి గ్రామ సరిహద్దు చెరువులో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ప్రశాంత్ సిబ్బందితో దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ రియాజ్ అలీ ముందు బైండోవర్ చేయగా రూ.రెండు లక్షల జరిమానా విధించారు. పేకాట ఆడుతున్న ఐబీ తాండూర్‌కు చెందిన బానయ్య, వెంకటస్వామి, పెద్దబోయిన మల్లేష్, చిన్నయ్య, రెహమత్‌ఖాన్, సరండికి చెందిన మాడిశెట్టి కార్తీక్, కొట్ట మురళీని బైండోవర్ చేసినట్టు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

వందే భారత్ రైళ్లకు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలి

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్, కేరళ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరుతూ శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. రామగుండంతో పోలిస్తే నికర ఆదాయం మంచిర్యాల రైల్వే స్టేషన్‌కు అధికంగా ఉంటుందని, నిత్యం ఉద్యోగ రిత్యా ఇతర ప్రాంతాలకు మంచిర్యాల నుంచి ఎక్కువ శాతం ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉందన్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను మంచిర్యాలలో నిలపాలని కోరారు. దీనితో పాటు రామగుండంలో నిలిపే కేరళ ఎక్స్‌ప్రెస్‌ను మంచిర్యాలలో హల్టింగ్ చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా పట్టణ అధ్యక్షుడు కొమ్ము దుర్గ ప్రసాద్, ఎండీ సాధిక్, మోహన్ వర్మ, కస్తూరి పద్మా చరణ్, రాపోలు విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 36 మందిపై కేసు

నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ పోలీస్ ఆద్వర్యంలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన సందర్భంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 36 మంది పట్టుబడ్డారు. శనివారం వారికి హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేష్ పోలీస్‌స్టేషన్ పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్య సేవించి వాహనం నడపడంతో ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిని చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు. అనంతరం వారందరినీ లక్షెట్టిపేట కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ వారికి జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

ఆదివాసుల బంద్ సంపూర్ణం

- ఉమ్మడి జిల్లాలో మూతపడిన వాణిజ్య, వ్యాపార సముదాయాలు
- నిలిచిపోయిన రవాణా వ్యవస్థ
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘాల డిమాండ్



ఆదిలాబాద్ డిపో ఎదుట బైటాయించిన ఆదివాసీ సంఘాల నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జైనూర్ ఘటనను నిరసిస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) చేపట్టిన రాష్ట్ర బంద్ సంపూర్ణమైంది. ఉమ్మడి జిల్లాలో శనివారం వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి. తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఉదయం నుంచి నాయకులు వ్యాపార, వాణిజ్య సముదాయాలను మూసివేయించారు. డిపోల నుండి బస్సులు బయటకు రాకుండా ఆదివాసీ సంఘాల నాయకులు డిపోల ఎదుట బైటాయించారు. దీంతో వివిధ ప్రాంతాల వెళ్లాల్సిన బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. అత్యవసర పనులు కలిగిన వాళ్లు సైతం బయటకు వెళ్లలేకపోయారు. ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం-ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాల్లో ఆదివాసులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. తెరిచి ఉన్న దుకాణాలు మూసి వేయించారు. ముందస్తుగా ఆదివాసీ సంఘాలు బంద్‌కు పిలుపునివ్వడంతో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. అన్ని మండల కేంద్రాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో దుకాణాలు మూసివేశారు. రోడ్ల మీద చిరు వ్యాపారాలు సైతం కొనసాగలేదు. పలు ప్రభుత్వ ప్రయివేట్ విద్యా సంస్థలు తెరుచుకోలేదు. ఆర్టీసీ బస్సులు తిరగక పోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలోనూ బంద్ సంపూర్ణంగా కనిపించింది. వివిధ చోట్ల ఆదివాసీ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బంద్



ఆసిఫాబాద్‌లో బంద్‌లో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నాయకులు

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

- పాయిజన్ తాగించి హత్య చేశారని ఆరోపణలు
- ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాలు
- విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. కొందరు వ్యక్తులు కలిసి పాయిజన్ తాగించి కొట్టి చంపారనే ఆరోపణలతో విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. మావల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూర్ మండలం చోర్‌గావ్ గ్రామానికి చెందిన జితేందర్(19) మావల పోలీస్‌స్టేషన్ దగ్గరలో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ రిమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నాడు. శుక్రవారం రాత్రి హాస్టల్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు జితేందర్‌కు పాయిజన్ తాగించి కొట్టి అక్కడ పడేశారని స్నేహితులు ఆరోపిస్తున్నారు. స్నేహితులు రాత్రి రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందగా పరిస్థితి విషమంగా మారింది. వెంటనే కుటుంబీకులు, స్నేహితులు రాత్రికి రాత్రే పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం జితేందర్ మృతి చెందాడు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు రిమ్స్ ఎదుట సాయంత్రం రాస్తారోకో చేపట్టారు. దీంతో కాసేపు ట్రాఫిక్ జామ్ అయింది. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఘటన స్థలానికి డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐ చేరుకున్నారు. సంఘాల నాయకులను డీఎస్పీ ఎంత సముదాయించినా వినలేదు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థి కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీ హాస్టల్ వద్ద భద్రత లేదని, అక్కడ కొందరు మాదకద్రవ్యాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. హాస్టల్ వద్ద భద్రత ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. అలాగే దాడి చేసిన దుండగులకు పట్టుకొని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. విచారణ చేపట్టి నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, హాస్టల్ విద్యార్థులు, స్నేహితులు ఉన్నారు. విద్యార్థి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.





సెప్టెంబర్ 23న బ్లాక్ డే పాటించాలి



నవతెలంగాణ-నిర్మల్

సెప్టెంబర్ 23న బ్లాక్ డే పాటించాలని, నాలుగు లేబర్ కోడ్ ప్రతులను దగ్ధం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. 2019లో వేతనాల కోడ్‌ను 2020లో ఐఆర్ కోడ్, ఓఎస్‌హెచ్ కోడ్, సామాజిక భద్రతా కోడ్ మొత్తం నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిందన్నారు. అంతకు ముందున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను తెచ్చి బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గ హక్కులను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టిందని మండిపడ్డారు. కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం చేసిందన్నారు. పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరపకుండా యాజమాన్యాలకు కొమ్ము కాసిందని విమర్శించారు. దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ లేబర్ కోడ్లకు సంబంధించిన నిబంధనలు రూపొందించబడ్డాయని తెలిపారు. మరి కొన్ని రాష్ట్రాల్లో అమల్లోకి తెస్తున్నారని తెలిపారు. కార్మికవర్గ హక్కులకు ఉరి తాళ్లుగా మారిన ఈ లేబర్ కోడ్లను దేశ వ్యాప్తంగా కార్మికవర్గం, రైతాంగం వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 23న బ్లాక్ డే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీ, జిల్లా నాయకులు విజయ, రాజేశ్వరి, మంగ పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరకు భూములు ఇవ్వం : రైతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం తమ భూములను ప్రభుత్వం నిర్ణయించిన రూ.8.50లక్షలకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని యాపల్‌గూడ రైతు రమేష్ స్పష్టం చేశారు. శనివారం రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు 8లక్షల50వేలకే భూములు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరానికి రూ.40లక్షలతో పాటు ఇంటికో ఉద్యోగం, ఇంటి నిర్మాణం చేసి ఇస్తేనే స్వచ్ఛందంగా భూములు ఇస్తామన్నారు. లేని పక్షంలో ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అధికారులు అనవసరంగా తమపై ఒత్తిడి పెంచడంతో పాటు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న సీపీఐ(ఎం) శాఖ మహాసభలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నవంబర్ 8,9 తేదిల్లో నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా మహాసభ నేపథ్యంలో శాఖ మహాసభలను నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ పట్టణ సెక్టర్ మహాసభ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ జిల్లా మహాసభల నేపథ్యంలో అన్ని శాఖల మహాసభలను పూర్తి చేసుకుంటున్నామని తెలిపారు. ఇందులో వచ్చే మూడు సంవత్సరాల పాటు నిర్వహించే పోరాటలు, ఉద్యమాలపై కార్యాచరణను రూపొందిస్తామన్నారు. వాటిని జిల్లా మహాసభల్లో ప్రవేశపెట్టి దశాల వారీగా ప్రజలు, కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్రాత్రి, మంజుల, లింగన్న, ఆశన్న, సురేందర్ పాల్గొన్నారు.

బాపూజీ ఆశయ సాధన దిశగా ప్రభుత్వాలు పనిచేయాలి



ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన స్ఫూర్తితో సాధించిన తెలంగాణలో ఆశయ సాధన దిశగా ప్రభుత్వాలు పని చేయాల్సిన అవసరముందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో ఆయన విగ్రహానికి పద్మశాలి, బీసీ సంఘం నాయకులతో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ కల సాధ్యమైందంటే అది లక్ష్మణ్ బాపూజీ ఆలోచన విధానంతోనేనని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. నేటి తరం యువతకు చరిత్ర గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామగ్రామన ప్రభుత్వ ఖర్చులతో బాపూజీ విగ్రహాలను ఏర్పాటు చేయాలని, ఇటీవల శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వానికి విన్నవించానని తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం సమీపంలోని బాపూజీ చౌక్ వద్ద స్మృతి వనం ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా ఎమ్మెల్యే స్పందిస్తూ నిధులు వచ్చిన వెంటనే స్మృతి వనాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పద్మశాలి సంఘం నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, పద్మశాలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేష్, కన్వీనర్ జక్కు సత్యనారాయణ, తాలూక సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, తాలుక ప్రధాన కార్యదర్శి చిలుక విలాస్, పద్మవార్ రాకేష్, మోర ఆశన్న, దాసరి రమేష్, రాజు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యమ నేత బాపూజీ మలి తొలి దశ ఉద్యమాల్లో మంత్రి పదవిని లెక్క చేయకుండా ఉద్యమించారన్నారు. పద్మశాలి సంఘానికి గుర్తింపు తెచ్చిన మహనీయుడని కొనియాడారు. పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ ఆయన ఆశయాలకు అనుగుంగా ముందుకు సాగాలన్నారు. కేసీఆర్ గుర్తింపు ఇవ్వలేదని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తింపు ఇచ్చేలా హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ పార్కుకు లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడంపై హర్ష వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పెంట వెంకన్న, కోశాధికారి దత్తు, మండల అధ్యక్షుడు అనుముల ఊశన్న, తాలుక ఉపాధ్యక్షుడు ఊశన్న, మేకల నర్సింగ్‌రావు, జక్కుల సత్యనారాయణ, బండ శ్రీను, కుర్ర రవి, కిష్టన్న, విఠల్, సందీప్ పాల్గొన్నారు. తాలుకా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలోనూ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపూజీ చేసిన సేవలను స్మరించుకుంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, పద్మశాలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేష్, కన్వీనర్ జక్కు సత్యనారాయణ, తాలూకా సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, తాలుకా ప్రధాన కార్యదర్శి చిలుక విలాస్, మోర ఆశన్న, దాసరి రమేష్, రాజు పాల్గొన్నారు.

ముధోల్ సీఐ, ఎస్సైకి ఘన సన్మానం

నవతెలంగాణ-ముధోల్



మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్‌లను ముధోల్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ ఎస్‌వి గిరి ఘనంగా సన్మానించారు. ఈనెల 13న ఎస్‌బీఐ బ్యాంకులో చోరీకి యత్నం జరిగటంతో ఈ కేసును ముధోల్ పోలీసులు చాలేంజ్‌గా తీసుకోని వారం రోజుల్లో నింధితులను పట్టుకున్నారు. దీంతో సీఐ, ఎస్సైని మేనేజర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తలమడుగు



ఇటీవల టిప్పర్ ప్రమాదంలో మరణించిన మెస్రం మహేందర్ కుటుంబాన్ని శనివారం సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి మందగూడ గ్రామానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. రోడ్డు ప్రమాదం గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, వెంట గోక సాగర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

బ్యాంకులో చోరీ యత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

- వారం రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు



నవతెలంగాణ-ముధోల్

బ్యాంకులో చోరీకి యత్నం కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు ముధోల్ సీఐ మల్లేష్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 13న ముధోల్ పాత బస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకు వెనుక భాగంలో వెంటిలేటర్‌కు ఉన్న ఇనుప చువ్వలు తొలగించి, ఇద్దరు దొంగలు బ్యాంకులో చొరబడ్డారు. బ్యాంకులో ఉన్న సీసీ కేమెరాలు, ఆలారం వైర్‌లను కత్తిరించి చోరీకి యత్నం చేశారు. వీలు కాకపోవడంతో పరారయ్యారు. అయితే ఆరోజు గణేష్ నిమజ్జనం ఉండటం, పోలీస్ బందోబస్తు ఉన్నప్పటికీ చోరీ జరగడంతో ముధోల్ పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో ఎస్సై సాయికిరణ్ తన సిబ్బందితో రెండు టీమ్‌లు ఏర్పాటు చేశారు. విచారణ ముమ్మరం చేశారు. దీంతో బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాల్లో ఇద్దరు నిందితులను కనిపించడంతో విచారణ జరిపారు. దీంతో ముధోల్‌కు చెందిన షేక్ మోసిన్ అహ్మద్, మమ్మద్ ఇర్ఫాన్ ఉద్దీన్‌లు చోరీకి యత్నం చేసినట్టు పోలీసులు గుర్తించారు. నిందితులను శనివారం ఉదయం అరెస్టు చేశారు. నిందితులు జల్సాలకు అలవాటు పడి, దొంగతనానికి ప్రయత్నించి పోలీసులకు చిక్కారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ కేసును వారం రోజుల వ్యవధిలో ముధోల్ పోలీసులు ఛేధించి శభాష్ అనిపించుకున్నారు.

నేడు నిర్మల్‌కు కోదండరాం రాక

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్మల్‌లోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సాధకులు, ఉద్యమ రథసారథి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరు కానున్నన్నట్టు ముధోల్ తెలంగాణ జన సమితి పార్టీ ఇన్‌చార్జి సర్ధార్ వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లాలోని ఉద్యమకారులందరు పెద్ద ఎత్తున హాజరై ఉద్యమ కారుల సమస్యల సాధనలో పాలుపంచుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రాథమిక దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

బడి పిల్లలు ప్రాథమిక దశనుంచే క్రమశిక్షణగా ఉండేలా అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు బడి పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. బోధనలో ఉపాధ్యాయులు అనుసరించే విధానం విద్యార్థులను ఎంతగానో ప్రభావితం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సమత, అంగన్‌వాడీ టీచర్ విజయ బడి పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలకు సరైన పోషకాహారం అందించాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పసి పిల్లల ఎదుగుదలకు సరైన పోషకాలతో కూడిన ఆహారం అందించాలని కౌన్సిలర్ ఫౌజియ షబ్బీర్ సూచించారు. శనివారం పట్టణంలోని 12వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పిల్లలకు బాలామృతం సరిగా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల, టీచర్లు సరోజ, మమత, ఎఎన్‌ఎం పద్మ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఆంగ్లం, తెలుగు, ఎకనామిక్స్, కామర్స్, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, సబ్జెక్టులలో పీజీలో కనీసం 55శాతం మార్కులు ఉన్న అభ్యర్థులు ఈనెల 24వ తేదిలోపు భైంసా గోపాలరావు పటేల్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు భైంసా డిగ్రీకళాశాలలో ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు నెట్, సెట్, పీ హెచ్‌డీ, కలిగి ఉన్నట్లయితే వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కళాశాలలో బోధన అనుభవం ఉన్నవారికి కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. 22వ తేది ఆదివారం సెలవు అయినప్పటికీని కళాశాలలో దరఖాస్తులను తీసుకుంటామని చెప్పారు. మిగతా వివరాల కోసం కళాశాల ప్రిన్సిపల్ సెల్ నెంబర్ 9963308287ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో పోషకుల సమావేశం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని మన్మథ్, రాజుర ప్రాథమిక, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలతో పాటు ఆయా పాఠశాలల్లో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రెగుంట రాజేశ్వర్, మల్కగౌడ్ మాట్లాడుతూ పాఠశాలకు గ్రామస్తులు అందిస్తున్న సహకారంతో పాఠశాలలో అన్ని వసతులు కల్పించామని, తల్లితండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని సూచించారు. ప్రతి నెలలో మూడో శనివారం పోషకుల సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి పిల్లల తల్లితండ్రులు తప్పక హజారు కావాలని కోరారు. చదువు విషయంలో పిల్లలలో ఏమైనా సందేహాలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆయా తరగతుల ఉపాధ్యాయులు పోషకులకు వారి పిల్లల హజరు శాతం, ఇటీవల నిర్వహించిన ఎఫ్ఏ పరీక్ష ఫలితాలు, ప్రాజెక్ట్ వర్క్ ఫలితాలను విద్యార్థుల తల్లి తండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలి

- మంత్రి సీతక్క
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-ఉట్నూర్

కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని మంత్రి సీతక్క అన్నారు. శనివారం పట్టణంలోని కేబీ కాంప్లెక్స్ ప్రాంగణంలో బీఈడీ కళాశాల అదనపు గదులు, గిరి వికాసం బాలికల పాఠశాల అదనపు గదులు, ఇందిర మహిళా శక్తి పథకం కింద కోడి పిల్లల పెంపకం కేంద్రాన్ని, మొబైల్ బైక్ అంబులెన్స్, ట్రైసైకిల్‌ల పంపిణీ, ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ప్రాంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. బీఈడీ శిక్షణ పూర్తి చేసుకున్న ఛాత్రోపాధ్యాయులు కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున కళాశాల అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. మొబైల్ బైక్ అంబులెన్సు, ట్రైసైకిల్‌ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందిర మహిళా శక్తి పథకం కింద కోడి పిల్లల పెంపకం కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మానవ సేవే మాధవ సేవ లాగానే డాక్టర్లు పని చేస్తేనే మీ వృతికి గౌరవం ఉంటుందని అన్నారు. మారుమూల అటవీ ప్రాంతాలలో మీరు విధులు నిర్వహిస్తే మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం జండాను ఊపి బైక్ అంబులెన్స్‌ని ప్రారంభించారు. వికాసం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి వారికి చాక్లెట్‌లను ఇచ్చారు. అందరూ బాగు చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, సబ్ కలెక్టర్ యువరాజ్, ఎమ్మెల్సీ దండే విఠల్, డీడీ వసంతరావు, ఈఈ భీంరావ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ మనోహర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భైంసాలో విజృంభిస్తున్న జ్వరాలు

- ఏరియా ఆస్పత్రి ఓపీకి రోజుకు వెయ్యి మంది రోగులు
- పదుల సంఖ్యలో డెంగ్యూ కేసులు

నవతెలంగాణ-భైంసా

జ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రతి ఇంటా ఇద్దరు ముగ్గురు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటివరకు భైంసా ఏరియా ఆస్పత్రిలో మూడు రోజుల్లోనే 28 డెంగ్యూ కేసులు వచ్చాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో స్పష్టమవుతుంది. ప్రయివేట్ ఆస్పత్రుల్లో సైతం పెద్ద సంఖ్యలో డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయి. భైంసాలోనే అత్యధికంగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 20న ఏపీ నగర్‌కు చెందిన ప్రీతి అనే యువతి వారం రోజులుగా జ్వరంతో బాధపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి ఉదయం వేళ అవుట్ పేషెంట్లు బారులు తీరుతున్నారు. ఒక్కరోజే 600 నుంచి 1000మంది వరకు అవుట్ పేషెంట్లు రావడంతో వైద్యులు, సిబ్బంది చికిత్స చేయడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. వంద పడకల ఆస్పత్రిలో రోజుకు వందల మంది అడ్మిట్ అయితే, సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పట్టణంలోని పూలేనగర్‌లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇదే కాలనీలో నాలుగు నుంచి ఐదు డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. ప్రయివేటు ఆస్పత్రిలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఎక్కడ చూసినా ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. దీనికి తోడు చికెన్ గున్యా వ్యాధి ప్రజానీకాన్ని పట్టి పీడిస్తుంది. జ్వరాల విజృంభణ తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ జిల్లా అధికార యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అంతంత మాత్రంగానే పట్టించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు, ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతుంది. ఇకనైనా అధికార యంత్రాంగం వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.





27న మహాగర్జనను జయప్రదం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ సాయి



నవతెలంగాణ-ఉట్నూర్

ఛలో హైదరాబాద్ మహా గర్జనను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ సాయి అన్నారు. శనివారం ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఛలో హైదరాబాద్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలలు గడిచిన రాష్ట్ర విద్య రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదని, హాస్టల్ వసతులు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వాటిని సొంత భవనాలుగా నిర్మించాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను మూడు వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్ విడుదల చేయాలని అన్నారు. సుమారు రూ.7వేల కోట్లకు పైగా విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యాపకుల కొరతతో తెలంగాణ విద్యారంగం నేడు సంక్షోభంలో ఉందనీ, ప్రభుత్వాలు విద్యారంగానికి సరిపడాన్ని నిధులు ఇవ్వడం లేదనీ అన్నారు. ప్రభుత్వ అండతోనే కార్పొరేట్ మాఫియా, కోచింగ్ సెంటర్లు, ఇంజనీరింగ్ కళాశాలలో డొనేషన్లు ర్యాంకులు ఆశ చూపి లక్షల రూపాయలు దండుకుంటున్నారనీ ఆరోపించారు. ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో ఫీజులు విపరీతంగా పెంచారని అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో ప్రభుత్వ యూనివర్సిటీలలో కళాశాలలో పేద విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్య వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 27న జరిగే విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని ఇందిరాపార్క్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని, వేలాదిగా విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాయి లక్ష్మణ్, జగన్, నాగేందర్, విలాస్, చందు పాల్గొన్నారు.

చేయిచేయి కలిపారు.. పేద కుటుంబానికి అండగా నిలిచారు..

- దాతల సహకారం కోరిన సిరం సుష్మారెడ్డి
- బాధిత కుటుంబానికి రూ.50వేలు అందజేత

నవతెలంగాణ-భైంసా



మండలంలోని దేగామ గ్రామానికి చెందిన ఒడ్డెర హన్మంతు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పని చేసేవాడు. గత కొన్ని నెలల కింద అనారోగ్యం బారిన పడి ఇటీవలే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పదేండ్లలోపు చిన్నారులు ఉన్నారు. ఉండటానికి ఇల్లు లేదు, గుంట భూమి లేక పోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. దీంతో గ్రామానికి చెందిన సిరం సుష్మారెడ్డి అనే మహిళ చలించిపోయి అ కుటుంబానికి చేయూతను అందించడానికి సంకల్పించారు. తాను సాయం చేయడంతో పాటు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వాట్సాప్ స్టేటస్, సోషల్ మీడియా ద్వారా, తన మిత్రులను, గ్రామస్తులను కోరడంతో దాతలందరి సహకారంతో రూ.50 వేలు సమాకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సిరం సుష్మ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో రూ.25వేలు, ఇతరుల సహకారంతో రూ.25వేల ఆర్థిక సాయం అందించన్నారు. గ్రామానికి చెందిన కుమ్మరి లింగన్న, శివకుమార్‌తో పాటు గ్రామస్తులంతా తనకు సహకరించారన్నారు. వీధిన పడ్డ పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగికి సన్మానం



నవతెలంగాణ-ముధోల్

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి రవికుమార్ మండలంలోని తరోడ ప్రాథమిక పాఠశాలకు శనివారం 10 కుర్చీలను విరాళంగా అందజేశారు. దీంతో పోషకుల సమావేశం సందర్భంగా పాఠశాల, గ్రామస్తుల, ఆధ్వర్యంలో ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగి రవికుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించినందుకు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ బండారి గంగాధర్, మాజీ సర్పంచ్ శ్వేత రవికిరణ్‌గౌడ్, పాఠశాల చైర్మెన్ భూషి రాధ, ఉపాధ్యాయులు నీలిమ, వడ్నం వీణ, నాయకులు ఏయ్యఖాన్, శిలారి చిన్నన్న, మల్లెపూల మోహన్, సోనాయి రాములు, పోషకులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి, కఠినంగా శిక్షించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, రాయిసెంటర్ వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. శనివారం తలపెట్టిన తెలంగాణ బంద్‌లో భాగంగా ఉమ్మడి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో మార్కెట్ విద్యాసంస్థలు బ్యాంకు వాహనాల రాకపోకలు బంద్ పాటించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజలింగంకు వినతిపత్రం అందజేశారు. 1950 తరువాత వలస వచ్చిన మైనారిటీల భూయాజమాన్య హక్కు పత్రాలు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు వెంటనే రద్దు చేసి ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రభుత్వమే వారిని అక్కడి నుంచి తరలించాలన్నారు. సంఘటనలో ఆదివాసీలపై ఎదురు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించని యెడల పంచాయతీ రాజ్ చట్టం, పేసా చట్టం ప్రకారం మా ఊరిలో మా రాజ్యం ప్రకటిస్తామన్నారు. వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు కనక ప్రభాకర్, అడ శ్రీరామ్, నాగోరావ్, ఆత్రం పరమేశ్వర్, మాణిక్ రావ్, సాగర్, ఆనంద్‌రావ్, ఏత్మరాం, దీపక్, ఇస్రు, వినోద్, జైతు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని హవర్గ గ్రామంలో జక్కుల రాము, పర్ష ఎల్లవ్వ కిష్టాపూర్ గ్రామంలో మగ్గిడి రాంరెడ్డి, రాజూర గ్రామంలో తోట సంజీవ్, అప్ప పోతన్న ఎడ్డుర్, పొట్‌పల్లి గ్రామంలో భోజాబాయి లు ఇటీవల వివిధ కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న ముధోల్ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లె నారాయణరావు పటేల్ శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ వైస్ చైర్మెన్ ఓం ప్రకాష్ లడ్డా, మాజీ ఎంపీపీ రాంచందర్‌రెడ్డి, శంకర్ చంద్రే, లోకేశ్వరం కాంగ్రెస్ మండలాధ్యక్షులు గడ్డం సుదర్శన్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మెన్ రత్నాకర్‌రావు, మాజీ ఎంపీపీ లలిత భోజన్న, వైస్ చైర్మెన్ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమ సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కపిల్, ముత్తాగౌడ్, శేఖర్‌రెడ్డి, లక్ష్మణ్ పటేల్, మాజీ ఎంపీటీసీ దత్తురాం పటేల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ షఫీ, అర్ష ప్రసాద్, రైతు సంఘం అధ్యక్షుడు ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

నవతెలంగాణ-నిర్మల్

తొలి, మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించి, మంత్రి పదవిని సైతం త్యజించిన త్యాగాశీలి, తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు స్వరాష్ట్రం కోసం అనుక్షణం పరితపించిన తెలంగాణ వాది శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ కొనియాడారు. శనివారం బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పద్మశాలి కుల సంఘ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఒక వైపు, దేశం మరో వైపు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయలను ఎదురించి, ప్రజలను చైతన్యవంతం చేసి పోరాడిన తీరు మారువలేమని అన్నారు. బాపూజీ చూపిన బాటలో మనం అందరం ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బాధితునికి ఎల్‌ఓసీ అందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ మండలానికి చెందిన జులేఖ మహమ్మద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2లక్షల ఎల్‌ఓసిని ఆమె బంధువు నౌషిత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. బాధితురాలికి ఉత్తమ వైద్యం అందించే ఉద్దేశంతో సాయం చేసినట్లు తెలిపారు. రూ.2లక్షల ఎల్‌ఓసి ఇచ్చిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలి

నవతెలంగాణ-కౌటాల



విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని జిల్లా సైన్స్ అధికారి కట్కుం మధూకర్ అన్నారు. శనివారం ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గావుడె హనుమంతు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం ఉపాధ్యాయులకు ఎల్లప్పుడు సహకరించాలని అన్నారు. విద్యార్థులు ఇంటికొచ్చాక సెల్‌ఫోన్‌తో ఆడకుండా పుస్తకాలతో కుస్తీ పట్టేలా చూడాలన్నారు. మొదటిసారి పాఠశాలకు వచ్చిన సైన్స్ అధికారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదే శ్రీనివాస్, పిఆర్పీ గందం ప్రకాష్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమానికి కొండా లక్ష్మణ్ స్ఫూర్తి ప్రధాత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు చెందిన కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రధాతగా నిలిచారని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో 12వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా నిలిపిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. నిబద్ధత కలిగిన రాజకీయవేత్త, తెలంగాణ ఉద్యమ నిర్మాతగా, క్విట్ ఇండియా పోరాట యోధుడిగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, ఆసిఫాబాద్ మొదటి ఎమ్మెల్యేగా విశేషమైన సేవలు అందించాలని గుర్తు చేశారు. అటువంటి వ్యక్తి జిల్లాకు చెందినవాడు కావడం జిల్లా వాసులుగా గర్వకారణమన్నారు. అటువంటి మహనీయుని విగ్రహం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పూర్వ పట్టణ అధ్యక్షులు కోమటిపల్లి లింగయ్య, మార్కండేయ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు అనుమాల శ్రీకాంత్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ పాల్గొన్నారు.

పల్లెల్లో ఎమ్మెల్యే హరీష్‌బాబు పర్యటన

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలో శనివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పర్యటించారు. కోయపల్లి, గూడెం, బూరుగూడ, శివపల్లి గ్రామస్తులు వారి గ్రామ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దశల వారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం దిందా గ్రామస్తులతో సమావేశమై మాట్లాడుతూ అటవీ అనుమతుల జాప్యంతో దిందా వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం మొదలు కాలేదని, అటవీ అనుమతులు సాధించి బ్రిడ్జి నిర్మిస్తామని గ్రామస్తులకు తెలిపారు. కేతిని గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడుతూ 5వ తరగతి విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువులో రాణించాలని చెప్పి, విద్యార్థులకు పండ్ల రసాన్ని పంపిణీ చేశారు. బాలాజీ అనుకోడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న వగాడి దస్రు కొడుకు వగాడి చరణ్ సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకుని పరామర్శించాడు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జడ్పీటిసి దుబ్బుల మల్లయ్య, మాజీ సర్పంచ్ చౌదరి నారయ్య మురళి, తుకారాం, భీమేష్, మోహన్, నానాజీ పాల్గొన్నారు.

చెడు అలవాట్లు నేరానికి కారణం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తాత్కాలికంగా ఆనందాన్ని ఇచ్చే చెడు అలవాట్లు ప్రస్తుత పరిస్థితుల్లో నేరాలకు మూల కారణమవుతున్నాయని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవి రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో రెండు రోజులపాటు 'ధ్యానంతో సంతోషకరమైన ఆరోగ్యవంతమైన జీవితం' అనే అంశంపై నిర్వహించే అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు జరగడానికి మద్యం, మాదకద్రవ్యాల అలవాటు ప్రధాన కారణాలుగా ఉంటున్నాయని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి నేర ప్రవృత్తిని తగ్గించుకోవాలన్నారు. ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని కేసు కొట్టి వేయించుకోవాలని తెలిపారు. తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతిరోజు ధ్యానం చేస్తూ సత్ప్రవర్తనతో ఉండాలని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలని జైలు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, బ్రహ్మకుమారి రాణి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వెంకటేశ్వర్లు, అంజలీదేవి, జైలు అధికారులు పాల్గొన్నారు.

తపాలాపూర్‌లో న్యాయ అభియాన్



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలాపూర్ గ్రామంలో ఉన్న ఆదివాసీ గిరిజనులకు శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తపాలపూర్ గ్రామంలోని కోలం ఆదివాసీ గిరిజనులకు ప్రధానమంత్రి జాతీయ ఆదివాసి న్యాయమహా అభియాన్ కార్యక్రమం నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా న్యూ ఆధార్ కార్డు అప్లై చేయడం పీఎం జన్ ధన్ అకౌంట్ తీయడం, వైద్య ఆరోగ్యశాఖచే పోషకాహార లోపం, రక్తహీనత పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏటీడీఓ ఏ పురుషోత్తం, ఎమ్మెల్‌హెచ్‌పీ సందీప్, కొల్లూరి కమలాకర్ ఆరోగ్య కార్యకర్త, రమేష్ పంచాయతీ కార్యదర్శి విజయ, లలిత పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-దండేపల్లి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు జన్మదినం సందర్భంగా శనివారం గుమ్మడి రాజలింగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచితంగా పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందజేశారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ప్రజల ఆదరణ పొందారని ఆయన అన్నారు. తమ ప్రియతమ నాయకుడు నూరేళ్లు చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ఏర్పాటు చేసి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు.

ఆదివాసీ బంద్ విజయవంతం

- పోలీసుల పటిష్ట బందోబస్తు
- ఏజెన్సీలో నిలిచిపోయిన రవాణా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై లైంగిక దాడి చేసి హత్యాయత్నం చేసిన నిందితున్ని శిక్షించాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన జిల్లా బంద్ విజయవంతమైంది. జిల్లా కేంద్రంలోని వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. ప్రతి శనివారం జిల్లా కేంద్రంలో బజార్ కొనసాగుతుంది. అయినప్పటికీ వ్యాపారస్తులు పూర్తిగా దుకాణాలు మూసివేశారు. ప్రయివేట్ పాఠశాలలు ముందస్తుగా సెలవు ప్రకటించగా ప్రభుత్వ పాఠశాలలను ఆదివాసీ నాయకులు మూసి వేయించారు. బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులు మినహా ఎటువంటి వ్యవస్థలు నడవలేదు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

బంద్ సందర్భంగా పోలీసులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. అల్లర్లు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాలతో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు కరుణాకర్, రామానుజములు బందోబస్తుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లా కేంద్రంలో సిఐ సతీష్ ఉదయం నుండే ఆర్టీసీ బస్టాండ్ వద్ద బందోబస్తులో పాల్గొన్నారు.

ఏజెన్సీలో నిలిచిపోయిన రవాణా

తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఇచ్చిన బంద్ పిలుపు నేపథ్యంలో ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో రవాణా పూర్తిగా నిలిచిపోయింది. జిల్లాలోని ఏకైక డిపో ఆసిఫాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్లే బస్సులను పూర్తిగా రద్దు చేశారు. దీంతో పాటు ప్రయివేటు వాహనాలు కూడా పెద్దగా నడవకపోవడంతో రవాణా నిలిచిపోయింది. ఆసిఫాబాద్ డిపో పరిధిలోని కొన్ని రూట్లలో మాత్రమే ఆర్టీసీ అధికారులు బస్సులు నడపారు. ఆసిఫాబాద్ నుండి మంచిర్యాల, కాగజ్‌నగర్, రాజురా రూట్లలో మాత్రమే బస్సులు నడిచాయి. మారుమూల ప్రాంతాలకు నిలిపేశారు.



వాంకిడి : తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుండే మండల కేంద్రంలో దుకాణాలు, హోటళ్లు, కూరగాయల మార్కెట్‌ను బంద్ చేయించారు. ఎస్‌ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ముగిసిన ఆదివాసీల బంద్

కాసిపేట : జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై లైగికదాడి, హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చిన బంద్ కాసిపేట మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ముందుగా ఆయా గ్రామాల్లో వ్యాపార సముదాయాలను, పాఠశాలలను, కళాశాలలను బంద్ చేయించారు. అనంతరం కొండాపూర్ యాపతో పాటు సోమగూడెంలో ధర్నా చేశారు. ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్కు వినతిపత్రం అందజేశారు. నింధితుడిని ఉరి తీసి ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏజన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనేతరులను మైదాన ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేటలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి అదే జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, మండల గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు, ఆదివాసీ సేన అధ్యక్షుడు మడావి వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు కనక రాజు, నాయకోడ్ రాష్ట్ర కోశాధికారి కొమ్ముల బాపు, కుర్సింగ తిరుపతి, మంగ శ్రీకాంత్, పెంద్రం ప్రభాకర్, సోమగూడెంలో బుర్స గోపాల్, భీమయ్య, రఘు, రాజయ్య, వెంకటస్వామి, భీమయ్య పాల్గొన్నారు.

వాంకిడిలో..



కాగజ్‌నగర్‌లో మహిళ హల్‌చల్

- యువకునిపై దాడి, ప్రతిదాడులు
- నిరసనగా రోడ్డుపై బైటాయించిన మహిళ
- మహిళను ఢీకొన్న కారు, గాయాలతో ఆసుపత్రికి తరలింపు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో శనివారం రాత్రి ఓ మహిళ హల్‌చల్ సృష్టించింది. తన వ్యక్తిగత వీడియోలు ఒక యువకుని వద్ద ఉన్నాయనే కారణంగా ఆ మహిళ యువకునిపై దాడి చేయగా, ఆ యువకుని సంబంధీకులు ఆ మహిళపై ప్రతిదాడికి దిగారు. వివరాలను టౌన్ సీఐ శంకరయ్య వెల్లడించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన రేష్మా అలియాస్ రీమా యాదవ్ శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లోని ఒక మద్యం దుకాణంలో పని చేసే చిలుముల పురుషోత్తంపై దాడికి పాల్పడింది. దీంతో పురుషోత్తంతో పాటు అతని సంబంధీకులు ప్రతిగా ఆ మహిళపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఆ మహిళ ఎన్టీఆర్‌చౌక్‌లోని రోడ్డుపై బైటాయించింది. టౌన్ సీఐ శంకరయ్యతో పాటు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని ఇరు గ్రూపులను సముదాయించే ప్రయత్నం చేస్తున్న సమయంలోనే అటుగా వచ్చిన కారు రోడ్డుపై కూర్చున్న రేష్మాను వెనుక నుండి ఢీకొట్టింది. దీంతో ఆమెకు గాయాలు కాగా స్థానికులు వెంటనే ఆమెను కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మంచిర్యాలకు తరలించారు. బాధితుడు చిలుముల పురుషోత్తం ఫిర్యాదు మేరకు రేష్మా, సంతోష్, సాయిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. రేష్మాను వెనుకనుండి ఢీ కొట్టిన కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

జిల్లా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఆ పార్టీ జిల్లా నాయకులు కోరారు. శనివారం హైదరాబాద్‌లో తమ్మినేనిని జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, గొడిసెల కార్తీక్ కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రాష్ట్ర కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగా ఉన్నాయని, దీంతో రైతులకు సాగునీరందడం లేదని అన్నారు. వైద్య పోస్టులను భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసేందుకు 44 వైద్య పోస్టులు అవసరం ఉండగా, కేవలం 24 మంది మాత్రమే పని చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పోరాట ఫలితంగా కార్మికులకు లాభాల వాటా

- జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలి
- ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్

నవతెలంగాణ-రెబ్బెన

కార్మికులు గత 20 సంవత్సరాల నుంచి ఎన్నో పోరాటాలు చేసి లాభాల వాటా సాధించుకున్నామని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. శనివారం గోలేటిలో లిసింగరేణి కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులకు స్వీట్లు తినిపిస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ పోరాట ఫలితంగానే కార్మికులకు 33 శాతం లాభాల వాటా కాంట్రాక్టు కార్మికులకు రూ.5000 చెల్లించడం జరుగుతుందని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలని గత 20 సంవత్సరాల నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు ఎన్నో త్యాగాలు చేశామని గుర్తు చేశారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లాభాల వాటా చెల్లించేందుకు కృషిచేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు భీమేష్, చందు, ఇప్ప భీమయ్య పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యుడు ప్రకాష్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లాభాల వాటా ప్రకటించిన నేపథ్యంలో శనివారం గోలేటి లోని జీఎం కార్యాలయంలో అధికారులకు, కార్మికులకు స్వీట్లు తినిపించి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ కృషితో సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించడంతో పాటు, కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటాను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చిన అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనేక హామీలను అమలు చేసిందని అన్నారు. ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో జీఎం ఆఫీస్ పిట్ కార్యదర్శి భీమేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లాస్, నాయకులు దుర్గం రవీందర్, పుదరి సాయి, బాలు నాయక్, మహేష్, ఉద్యోగులు మౌనిక, స్రవంతి, బాబా, రాజయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ కాలనీకి చెందిన మిరుదొడ్డి శంకర్(55) శుక్రవారం రాత్రి మురుగు కాలువలో పడి మృతి చెందాడు. ఎస్ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం శంకర్ శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో పని నిమిత్తం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మురికి కాలువలో పడి మృతి చెందాడు. రాత్రి కుటుంబసభ్యులు శంకర్ కోసం గాలించినా కనిపించలేదు. శనివారం ఉదయం స్థానికులకు మురికి కాలువలో శంకర్ మృతదేహం కనిపించడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య తార, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ఎస్పీఎం యాజమాన్యందే బాధ్యత : అంబాల ఓదేలు

శంకర్ మృతికి సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యం బాధ్యత వహించాలని ఎస్పీఎం కార్మిక యూనియన్ నాయకుడు అంబాల ఓదేలు డిమాండ్ చేశారు. సిర్పూరు పేపర్ మిల్లు నుండి వెలువడే కాలుష్యపు నీటిని ఈ మురికి కాలువలోకి వదిలేస్తారని, శంకర్ చీకట్లో ఆ మురికి కాలువలోని కాలుష్యపు నీటిలో పడడంతోనే మృతి చెందాడని పేర్కొన్నారు. కనీసం ఆ మురికి కాలువకు రక్షణ గోడ నిర్మించినా ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని, వెంటనే కాలువకు ఇరు వైపులా రక్షణ గోడ నిర్మించడంతో పాటు శంకర్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కో ఆర్డినేటర్ హరీష్‌రావు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్‌ఐవి నియంత్రణపై ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కౌమారదశలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. లైంగిక వ్యాధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి హెచ్‌ఐవి నివారణలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రకాష్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జయంతి, అధ్యాపకులు అశోక్, యాదగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి సైకిల్ అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట



అడాప్ట్ ఎ విలేజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈవినింగ్ ట్యూషన్ సెంటర్‌లోని విద్యార్థిని ఆలియా పదో తరగతి పరీక్షలో 9.5 జీపీఏ సాధించినందుకు ఆ సంస్థ కోఆర్డినేటర్ రత్నరాజు సైకిల్‌కు బహుకరించారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డు రవి జోసఫ్ మాట్లాడుతూ విద్యార్థుల చదువులో ప్రోత్సహించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ పాల్ సుధాకర్, ప్రభుదాస్ జిల్లపెల్లి, ఫీల్డ్ వర్కర్ సుస్మిత, చరణ్ తేజ, ఆశా కార్యకర్త హెలెన్, కిరణ్ తేజ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్ గ్రామ పంచాయతీలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో జ్వరాలు పెరుగుతున్న కారణంగా గ్రామస్తులు అభ్యర్థన మేరకు గ్రామంలోని పది రోజుల పాటు కాలనీల్లో నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో, డ్రైనేజీల్లో, చెత్త ఉన్న ప్రదేశాల్లో, చెట్ల పొదల్లో ఫాగింగ్, మిస్టింగ్ చేస్తూ దోమల నివారణ చర్యలు చేపట్టారు.

గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండలం రొట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పాత తిరుమలాపూర్, కొత్త తిరుమలపూర్ గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లోని 45 గిరిజన కుటుంబాలకు 12 రకాల నిత్యవసర వస్తువులు అందచేశారు. ఈ మధ్య భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో నిరాశ్రయులైన వారిని ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుసుదన్‌రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అభినవ్, సంతోష్ కుమార్, బుద్ధినేని సత్యనారాయణరావు, ఎడ్ల కిషన్, ఆదివాసీ సంఘం నాయకుడు పెంద్రం హన్మంతు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొండపూర్ యాపకు చెందిన మక్కల వెంకటేశ్(33) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం ఇంట్లో కుటుంబీకులతో గోడవ పెట్టుకుని మనస్థాపానికి గురై మల్కపల్లి గ్రామ శివారులోని వారి పంట చేనులో గడ్డి మందు తాగాడు. కొద్దిసేపటికి ఇంటికి రావడంతో గమనించిన భార్య కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు గురువారం హైదరాబాద్ తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుణమున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు..

అంగన్‌వాడీలో పోషణ మాసం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలో వెంకట్రావుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 1,2 పోషణ మాసం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోషక ఆహారం గురించి, అందుబాటులో ఉండే కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, పాలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు, తల్లులకు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అలాగే మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు హెచ్‌బీ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీపావహిని, ఏఎన్‌ఎం సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు శారద, సుగుణలత, ఆశాలు రాణి, మమత పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం తగ్గించాలి'

నవతెలంగాణ-జన్నారం



పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా జన్నారం మండల పంచాయతీ కార్మికులు శనివారం జన్నారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శశికళకు వినతి పత్రం అందజేశారు. అలాగే పంచాయతీ కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మధు, క్యాషియర్ విశ్వ, చంద్రమౌళి, సాగర్, వినోద్, జాను శ్రీకాంత్, సరిత, కళ్యాణి, మహేష్, రమేష్, రాజన్న, ఇన్‌చార్జి ఈఓ పీఆర్డీ జలంధర్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే ఇవ్వాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలోని బొగ్గు బ్లాక్లను సింగరేణికే ఇవ్వాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-1 గనిలో బొగ్గు బ్లాక్‌లను వేలం పాటలో పెట్టకుండా సింగరేణి సంస్థకే ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మెమోరండం ఇవ్వడానికి సీపీఐ(ఎం) సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలంపాట పేరుతో ప్రయివేట్ కార్పొరేట్ సంస్థలకు ఇవ్వాలని నిర్ణయించుకొని హైదరాబాద్ కేంద్రంగానే బొగ్గు బ్లాక్‌ల వేలంపాటను నిర్వహించడం జరిగిందన్నారు. ఇది అమలు జరిగితే భవిష్యత్తు కాలంలో సింగరేణి సంస్థ కోలుకోలేని దెబ్బతింటుందని, ప్రస్తుతం సంస్థలో యువకులుగా ఉండి పనిచేస్తున్న కార్మికులు దిక్కు తోచని స్థితి ఏర్పడుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జులై 29 నుంచి ఆగస్టు 5 వరకు సింగరేణి పరిరక్షణ యాత్ర చేసి కార్మికుల్లో ప్రజల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల లోపకారితరాన్ని వివరించడం జరిగిందన్నారు. రెండోదఫా పోరాటంలో భాగంగా అన్ని ప్రాంతాలలో సంతకాల సేకరణ చేసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్కు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వినతి పత్రం ఇవ్వడం కోసమే సంతకాల సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. దీనికి కార్మిక వర్గం ప్రజలు సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు సీపీఐ(ఎం) చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, నస్పూర్ మండల నాయకులు మిడివెల్లి రాజ్ కుమార్, పాయిరాల రాములు, గంగాధర చారి, అభినవ్ పాల్గొన్నారు.

సింగరేణి మైనింగ్ స్టాఫ్‌పై బెదిరింపులు మానుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ గనుల్లో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మొతుకూరి కొమురయ్య మైనింగ్ స్టాఫ్‌పై, ఓవర్మెన్స్ పై, బెదిరింపులు మానుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ కొమురయ్య బెదిరింపులకు వ్యతిరేకంగా మైనింగ్ స్టాఫ్ నల్ల బ్యాడ్జిలతో శనివారం నిరసన తెలిపారని వారికి పూర్తి మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. వృత్తి పరంగా బాధ్యతాయుతమైన పదవిలో కొనసాగుతూ, యూనియన్ పరంగా కొమురయ్య మైనింగ్ స్టాప్‌పై ఈ విధంగా ప్రవర్తించడం సరికాదని అన్నారు. అధికారులు అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని, కార్మికులను వైదిస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు.

లింగాకర్షణ బుట్టలతో గులాబీ, లద్దె పురుగుల నివారణ

నవతెలంగాణ-తాండూర్

పత్తి పంటలో గులాబీ లద్దెపురుగుల నివారణకు లింగాకర్షక బుట్టలు వాడాలని జగిత్యాలవ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. వారు శనివారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పత్తి పంటలో గులాబీ లద్దె పురుగుల నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు లద్దెపురుగు ఉధృతి నివారణకై లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవాలని సూచించారు. లింగాకర్షక బుట్టలో ఆడపురుగు వాసనతో కూడిన లూర్స్ అమర్చినట్లైతే మగ పురుగు ఆకర్షించబడి బుట్టలో పడుతుందని తెలిపారు. దాంతో మగ పురుగుల ఉధృతి తగ్గి సంతానోత్పత్తి తగ్గడం వల్ల పత్తి పంటలోగులాబీ, లద్దే పురుగులను నిర్వారించవచ్చునన్నారు. రైతులు పత్తి పంటలలో ఎకరానికి ఆరు లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని విద్యార్థులు రైతులకు సూచించారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



నవతెలంగాణ-జన్నారం

స్వాతంత్ర సమర యోధులు ప్రత్యేక తెలంగాణా తొలి, మలి దశ పోరాట వీరులు బడుగు బలహీన వర్గాల ముద్దు బిడ్డ ఆచార్య కొండా లక్ష్మణ్ భాపూజీ 12వ వర్ధంతి శనివారం బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రస్తుత ఆసిఫాబాద్ జిల్లా తిరియాణి ప్రాంతంలో జన్మించారని వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా నుండి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి బీసీ నాయకుడుగా ఎదిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేపే నరసింహులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కోకన్వీనర్ కడార్ల నరసయ్య, మూల భాస్కర్ గౌడ్, మామిడి విజయ్, మంచిర్యాల జిల్లా కోకన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కొత్త భారతీయ న్యాయ సంహిత చట్టంపై బాల, బాలికలకు అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. శనివారం లక్షెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితే, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఎంచుకున్న రంగంలో నెంబర్ వన్‌గా నిలవవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, ఎస్ రవీందర్, లీగల్ అడ్వైజర్ సురేందర్, పద్మ, కోర్టు సీనియర్ న్యాయవాదులు, సమాచార హక్కు గురించి, మైనర్ బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు, మేజర్లు అయిన తర్వాత ఉండే హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు, జడ్జి వివరణాత్మక సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె రమా కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ కె.మహేశ్వర్ రావు, ఉపాధ్యాయులు హెచ్ శ్రీలత, కె సాధిక, ఎం వినయ్, ఆర్ ప్రజ్ఞ పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే ఇంటిని కూల్చేశారు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని మాజీ టీబీజీకేఎస్ నాయకుడు దీకొండ అన్నయ్య ఇల్లును రాజకీయ కక్షతోనే కూల్చివేశారని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఆరోపించారు. శనివారం నాస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ అండదండలతోనే ఇంటిని కూల్చివేశారని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణంలో అల్లర్లు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా, నివాసముంటున్న ఇల్లును కూల్చడం మానవతా విలువలను కోల్పోవడమేనని, సమాజం సిగ్గుతో తలదించుకుంటుందని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రజా పాలన అనే నినాదంతోని ముందుకు వెళుతుంటే, అధికార పార్టీ నాయకులు డబ్బులు సంపాదించుకోవడం కోసం కుట్రలో భాగంగానే ఇల్లును నేలమట్టం చేశారని అన్నారు. నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మెరుగు పవన్, సీనియర్ నాయకులు జక్కుల రాజేశం, పంబాల ఎర్రయ్య, అహ్మద్, గుమ్మడి శ్రీనివాస్, జనార్ధన్, రఫిక్ ఖాన్ పాల్గొన్నారు.

ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు..

ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే అక్రమంగా తన ఇంటిని కూల్చివేశారని బాధితుడు దీకొండ అన్నయ్య ఆరోపించారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నస్పూర్ మున్సిపాలిటీ అధికారులు తనకు ఇంటిని కూల్చే విషయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, గురువారం తను వాకింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లారని, అనంతరం తన కుటుంబ సభ్యులను కూడా అదుపులోకి తీసుకొని అన్యాయంగా ఇంటిని కూల్చివేశారని అన్నారు. తను నివాసమున్న ఇంటిని సర్వే నెంబర్ 40/2 గల 350 గజాల భూమిని పొనుగోటి ప్రేమలత వద్ద 2019లో కొనుగోలు చేసినట్టు తెలిపారు. అనంతరం ఇంటి నిర్మాణం కోసం మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకున్నానని టౌన్ ప్లానింగ్ నుండి అనుమతి రావడంతోనే ఇంటిని నిర్మించుకున్నట్లు తెలిపారు. అధికారులు అనుమతి ఇచ్చిన తర్వాతనే ఇంటి నిర్మాణాన్ని చేపట్టానని, గత రెండు సంవత్సరాలుగా అదే ఇంట్లో నివాసం ఉంటున్నానని తెలిపారు. ఇంటిని కూల్చిన సమయంలో దాదాపు రూ. 60 లక్షల బంగారం, నగదు పోయాయని, తన కుమారుని, కోడలు సర్టిఫికెట్స్ కనిపించడం లేదని, కుమారుని సర్జికల్ పరికరాలు, ఫర్నిచర్ ధ్వంసం అయ్యాయని తెలిపారు. దీనికోసం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమారుడు నవీన్ కుమార్, అల్లుళ్ల రాజ్ కుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



గిరిజన మహిళపై లైంగిక దాడి చేసిన నిందితుడిని ఉరి తీయాలి

- తుడుందెబ్బ మండల అధ్యక్షుడు రాయిసిడాం కాళీ



నవతెలంగాణ-జన్నారం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనుర్ మండల కేంద్రంలో గిరిజన మహిళపై లైంగిక దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఉరి తీయాలని, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు రాయి సిడాం కాళీ అన్నారు. శనివారం ఆదివాసీ గిరిజన సంఘాల బందులో భాగంగా మండల డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు అనంతరం ఎస్ఐ రాజ వర్ధన్‌కు వేరువేరుగా వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైనూరులో 1950 తర్వాత వచ్చిన వారికి అక్కడ ఉన్న హక్కులన్నిటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాదితురాలి కుటుంబానికి న్యాయం చేసేంతవరకు ఆదివాసీ సంఘాల ఆందోళన నిరంతరం కొనసాగుతుందన్నారు. నిందితుడికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని యెడల ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు ఉర్మెత దర్ము పటేల్, పూనమ్ సోనేరావు, తుమ్మరం లక్ష్మణ్, మడావి జంగు, కొమరం అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే లాభాల వాటా

నవతెలంగాణ-నస్పూర్

ఏఐటీయూసీ నాయకులు కేవల్ మహేంద్ర పోరాట ఫలితంగానే కార్మికులకు సింగరేణి సంస్థలో లాభాల వాటా కొనసాగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. 2023-24 లాభాల వాటా కార్మికులకు 33 శాతం ఇవ్వడం సంతోషకరమైన విషయమని, అదే కాకుండా ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.5000 వాటా కల్పించామన్నారు. సింగరేణి సంస్థలో దేశంలో ఎక్కడైనా వరదలు సంభవిస్తే కార్మికుల ఒక రోజు వేతనం సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపించడం జరుగుతుందని, దీనికి కార్మికుల అనుమతి అవసరం లేదని తెలిపారు. కొన్ని యూనియన్ల నాయకులు యువ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణిలో రాజకీయ జోక్యం మొదలైందని, ప్రస్తుత ప్రభుత్వంలో ఇంకా పెరిగింది అన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని అన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 9 నెలలు గడచిన తర్వాత గుర్తింపు పత్రం ఇవ్వడం జరిగిందని ఇకపై కార్మికులకు స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, నాయకులు కొమురయ్య, సారయ్య, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్రాంతి భవనంలో కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నాగభూషణం మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన మంచిర్యాల నియోజకవర్గాన్ని అనతి కాలంలోనే అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుపోతున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మంచిర్యాల నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందు ఉంచేలా పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. నిరంతరం పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. త్వరలోనే ఏర్పాటు చేయబోయే మంత్రివర్గ విస్తరణలో రాష్ట్ర మంత్రిగా నియమితులై నియోజకవర్గాన్ని, రాష్ట్ర స్థాయిలో కూడా తన అమూల్యమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తనదైన ముద్ర వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, జిల్లా కార్యదర్శి బియ్యాల తిరుపతి, సీనియర్ నాయకులు వెంకటస్వామి, నడిమెట్ల రాజన్న పాల్గొన్నారు.

జన్నారంలో బంద్ ప్రశాంతం



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసీ గిరిజన సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా శనివారం జన్నారం మండలంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జన్నారం ఎస్ఐ రాజా వర్ధన్ ఆధ్వర్యంలో పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వాణిజ్య వర్తక చిరు దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి బందుకు మద్దతు తెలిపారు. బందు పూర్తిస్థాయిలో సంపూర్ణం అవ్వడానికి సహకరించిన వర్తక వాణిజ్య వ్యాపారస్తులకు మండల ఆదివాసీ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రాసింది ఒకటి.. ఇచ్చింది మరొకటి

- పీహెచ్‌సీలో జ్వరం, జలుబుకు షుగర్ మందులు ఇచ్చిన వైనం



నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరం జలుబుకు వుందని పోతే షుగర్ మందులు ఇచ్చిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని నంనూర్ గ్రామానికి చెందిన తిరుపతి అనే పేషెంట్ శనివారం జ్వరం, జలుబు ఉందని స్థానిక ఆస్పత్రికి వెళ్ళగా పరిశీలించిన వైద్యురాలు లహరి ఓ అట్ట కాగితం పై మందులు రాసి ఇచ్చారు. ఫార్మసీ వద్దకు వెళ్లి మందులు తీసుకున్న పేషెంట్ అనుమానం వచ్చి బయట మెడికల్ షాప్‌కి వెళ్లి చూపించగా అందులో షుగర్‌కు సంబంధించిన మందులు ఉన్నాయని తెలిసి అవక్కయ్యారు. ఇలా మందుల గురించి అవగాహన లేని వారు నిత్యం పదుల సంఖ్యలో ఆస్పత్రికి వస్తుంటారు. వారికి ఎలాంటి మందులు ఇస్తున్నారో అని ఈ సంఘటనతో అర్థమవుతోంది. గతంలో ఓ ముసలి రోగి కాళ్ళు నొప్పులు ఉన్నాయని ఆస్పత్రికి పోతే అక్కడ డ్యూటీలో వున్న ఏఎన్ఎంలు సెలైన పెట్టే క్రమంలో నరం కోసమని పదుల సంఖ్యలో సూదులు గుచ్చగా బయపడిన రోగి బెడ్‌పై నుంచి లేచి వైద్యం తీసుకోకుండానే ఇంటికి వెళ్ళిపోయిన సంఘటనలు ఉన్నాయి. వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తే కనీసం పట్టించుకునే వారు లేరని రోగులు చెబుతున్నారు. అసలు ఆస్పత్రిలో దగ్గు మందులు లేవని పంపుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వైద్యురాలిని వివరణ కోరగా నేను రోగిని చూసి మందులు రాసి ఇచ్చాను. కానీ అక్కడ రెగ్యులర్ ఫార్మసిస్ట్ లేకపోవడంతో ఎవరు మందులు ఇచ్చారో గమనించ లేక పోయాను అని పేర్కొన్నారు.

పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో హెల్తీ ఫుడ్ అండ్ జంక్ ఫుడ్ మీద శనివారం విద్యార్థులకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శనలో పండ్లు, కూరగాయల వంటి పోషకాహార ప్రయోజనాలను వివరించారు. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల హానికరమైన ప్రభావాలను తెలిపారు. ఈ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యత విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి శారీరక ఎదుగుదలను ప్రభావితం చేస్తుందని పాఠశాల యాజమాన్యం వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఈ రవి ప్రసాద్, ప్రిన్సిపల్ ఎం రాజా రమేష్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామంలో టీటీడీ రూ.10లక్షల నిధులతో బాలాజీ ఆలయాభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సబ్బండ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అహర్నిశలు పాటు పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సునీల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో బోస్ ఫెలోషిప్ ముగింపు కార్యక్రమం

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉట్నూర్‌లో గత నాలుగు రోజులుగా భారత్ దేఖో ఆర్గనైజేషన్, ఐటీడీఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న బోస్ ఫెలోషిప్ శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు ఈ నాలుగు రోజులు వారు నేర్చుకున్న విషయాలను, పొందిన అనుభవాలను వ్యక్తం చేస్తూ సంతోషంతో నేర్పించిన మెంటర్స్ పవన్, ఆస్రాలకు ధన్యవాదాలు తెలిపారు. శనివారం ప్రిన్సిపల్ టి.ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఈ శిక్షణా కార్యక్రమం లక్ష్యాన్ని, ఉద్యేశాన్ని నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.జి.సాయి ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.నర్సింగ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఆదివాసుల బంద్ సక్సెస్

- స్వచ్ఛందంగా షాపులు మూసివేత
- పాఠశాలలకు ముందస్తుగా సెలవు ప్రకటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనూర్ ఘటన నిందితుడిని ఉరి తీయాలని, వలస వచ్చిన వారిని మండలం నుంచి తరలించాలనే డిమాండ్‌తో ఆదివాసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌లో భాగంగా శనివారం ఆదిలాబాద్ బంద్ విజయవంతమైంది. తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఉదయం నాయకులు, ఆదివాసులు బస్టాండ్ చేరుకొని బస్సులు బయటకు రాకుండా బస్సుల ఎదుట బైటాయించారు. నిందితుడిని శిక్షించడంతో పాటు ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బంద్ విషయం తెలుసుకున్న దుకాణదారులు స్వచ్ఛందంగా వారి దుకాణాలను మూసివేసి ఉంచారు. అలాగే ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలు ముందస్తుగానే విద్యార్థులకు సెలవులు ప్రకటించాయి. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడి పాల్పడిన దుండగుడిని ఉరి తీయాలన్నారు. అదే విధంగా 1970 తరువాత వలస వచ్చిన వారిని తరలించాలన్నారు. ఏజెన్సీలో ప్రాంతంలో ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలన్నారు. తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చిన సమయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదివాసీ పెద్దలతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించడం సరికాదన్నారు. ఆదివాసులను విచ్ఛిన్నం చేసే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం బాధిత మహిళ చికిత్సకు సంబంధించి బాధ్యత తీసుకోవడంతో పాటు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాజభవన్, ప్రజాభవన్ ముట్టడిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సలాం వరుణ్, ఆదివాసీ మహిళా సంఘం ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షురాలు లలిత బాయి, ఆదిలాబాద్ డివిజన్ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి తొడసం ప్రకాష్, కోట్నాక్ రామారావు, కుమ్ర గోవిందరావు ఉన్నారు.

తలమడుగు : ఆదివాసీ మహిళపై జరిగిన లైంగికదాడికి నిరసనగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం బంద్ పాటించారు. మండల కేంద్రంలో ఉదయం తెరిచిన దుకాణాలను ఆదివాసీ నాయకులు రావడంతో యాజమానులు స్వచ్ఛంధంగా మూసివేశారు. నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదివాసీ సంఘ నాయకులు భుజంగరావు, పొచ్చన్న, దత్తు, రాము ఉన్నారు.

బోథ్ : ఆదివాసీ మహిళపై జరిగిన లైంగికదాడికి నిరసనగా ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు సొనాలలో శనివారం బంద్ చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలన్నారు. పాటించారు. లేనియెడల ఉద్యమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ బోథ్ మండల కమిటీ మండలాధ్యక్షులు కనక అమృత్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రామేల్లి బోజన్న, బోథ్ డివిజన్ అధ్యక్షులు దుర్వ విశ్వేశ్వర్‌రావు, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మెస్రం భూమన్న, డివిజన్ ఉపాధ్యక్షులు కుర్మే రాజన్న, మండల కమిటీ ఉపాధ్యక్షులు సంగెపు శంకర్, మంగరపు మహేష్, సొనాల మండల కమిటీ అధ్యక్షులు జుగ్నక్ మారుతీ, నాయకులు సార్మేడి మాడవి గంగారాం, మడావి మనోహర్, సెడ్మకి సురేష్, ఆడెం పొల్లన్న, కొడప విజయ్, గోడం జుగాదిరావు, నైతం కేశవ్, పంద్రం సోనేరావు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : ఆదివాసీ మహిళపై జరిగిన లైంగికదాడికి నిరసనగా తుడుం దెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం తల పెట్టిన రాష్ట్ర బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ వ్యాపార వాణిజ్య దుకాణాల తో పాటు హోటళ్లు, పాన్ షాప్‌లు, పూర్తిగా మూసి ఉంచారు. సంపూర్ణంగా బంద్ పాటించడంతో పల్లె జనం మండల కేంద్రానికి రాక పోవడంతో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందో బస్తును నిర్వహించారు. కేవలం మెడికల్ షాపులు, దవాఖానలు తప్ప ఇతర వ్యాపార దుకాణాలు పూర్తిగా బంద్‌ను పాటించాయి.

ఉట్నూర్ : జైనూర్ సంఘటనపై తెలంగాణ రాష్ట్ర బంద్‌కి ఆదివాసీ తుడుందెబ్బ పిలుపు మేరకు శనివారం ఉట్నూర్‌లో వ్యాపారస్తులు, ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు సంపూర్ణంగా బంద్ చేశారు. జైనూర్‌లో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక ఆదివాసీ నాయకులు అన్నారు.

తాంసి : ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ తుడుం దెబ్బ రాష్ట్ర బంద్‌కు పిలుపు మేరకు శనివారం మండలంలోని అంబుగాం, గిరిగాం, వామన్‌నగర్, ఆట్నంగూడ, గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు మండల కేంద్రానికి చేరుకొని గ్రామంలోని అన్ని కిరణ దుకాణాలు హోటళ్లను ఫర్టిలైజర్ మెడికల్ దుకాణాలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ మండలాధ్యక్షులు భరత్ మాట్లాడుతూ జైనూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళపై వేరే కులానికి చెందిన వ్యక్తి మహిళపై అత్యాచారానికి పాల్పడటంతో పాటు హత్య చేయడానికి పూనుకున్నాడన్నారు. ఆ నిందితున్ని వెంటనే కఠినంగా శిక్షించి, ఆదివాసి మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ బంద్ మద్దతుకు బీఆర్ఎస్ నాయకుడు మద్దతు పలికారు. కార్యక్రమంలో యశ్వంత్, పోచ్చిరాం, దుర్వ పరమేశ్వర్, కృష్ణ, రంజి, తుడుం దెబ్బ నాయకులు ఆదివాసీ, గిరిజన నాయకులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్ : ఆదివాసీ హక్కుల పోరాట కమిటీ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ శనివారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు ఆదివాసీ మహిళపై జరిగిన లైంగిదాడికి నిరసనగా బంద్ పాటించారు. అనంతరం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై అప్పారావు, సీఐ రమేష్‌లకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు మండలంలోని బజార్‌హత్నూర్, జాతర్ల, పిప్రి, గిర్నూర్, దేగామ, బూతాయి, మోర్కండి సంపూర్ణ బంద్‌ను పాటించారు. మండలంలో ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో తమ ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. బంద్‌ను ప్రశాంతంగా కొనసాగించారు.

జమిలి ఎన్నికల వద్దు .. దామాషా పద్ధతి ముద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జమిలి ఎన్నికల వద్దు దామాషా పద్ధతి ఎన్నికలే ముద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజల హక్కు భారత రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కు అందరికీ 18 ఏండ్లు పైబడిన వారందరికీ ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. సమాజానికి జమిలి ఎన్నికలు కాకుండా దామాషా పద్ధతి ఎన్నికలు జరిగితే ఒక విధి విధానాలు ఎన్నికల కమిషన్ రూపొందించుకున్న తర్వాత ఎన్నికల ఓట్లన్నీ లెక్కించి ఒక పార్టీలకు పార్లమెంట్ గాని అసెంబ్లీ గాని ఒక నిబంధనా ప్రకారం కేటాయించడం జరుగుతుందన్నారు. గత 12వ పార్లమెంట్‌లో గాని 14వ పార్లమెంట్‌లో గాని నల్గొండ ఎంపీగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సూరారం సుధాకర్‌రెడ్డి రెండుసార్లు పార్లమెంటులో దామాషాపద్ధతి ఎన్నికల విధివిధానాలు ఎట్లుంటాయి అనేది పార్లమెంట్లో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించి ఈ చట్టం కొరకు ముందుకు రావాలని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ అరుణ్ కుమార్, కుంటాల రాములు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కామ్లే రాందాస్, సీపీఐ సీనియర్ నాయకులు బెజ్జంకి, నర్సింగ్‌రావు, రైతు సంఘం నాయకులు భూమన్న, గంగన్న, దత్తు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సైలు



నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల బదిలీపై వచ్చిన ఖానాపూర్ ఎస్సై రాహుల్, దస్తురాబాద్ ఎస్సై శంకర్, పెంబి ఎస్సై సాయికుమార్ శనివారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీయమ నిబంధనలతో విధులు నిర్వహించాలని సూచించారు. శాంతియుతంగా ప్రజల్లో మేలుగుతూ వారికీ ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అందరి మనన్నలు పొందేలా కృషి చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా మార్గ దర్శనం చేస్తూ ముందుకు వెళ్లాలన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్‌పై అవగాహన



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ ఎమ్మెల్సీ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాధాన్యత, ఓటు విలువ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంచడం, బాధ్యతాయుత ప్రవర్తన పెంచడం కోసం ఎన్నికలు నిర్వహించి, విద్యార్థులకు అన్ని రకాల ఎన్నికలపై అవగాహన కల్పించామని అన్నారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిజమైన ఎన్నికల తరహా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల కంటే భిన్నంగా ఈ ఎన్నికలలో ప్రాధాన్యత క్రమంలో అందరు అభ్యర్థులకు ఓటు వేసే అవకాశం ఉంటుంది. ఈ చెల్లిన ఓట్లలో సగం కంటే ఎక్కువ ఓట్లు పొందిన వారే విజేతలు అవుతారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు వేసే ఎన్నికలు అయినప్పటికీ చాలా చెల్లని ఓట్లు నమోదవుతున్నాయి. విద్యార్థులు 6వ తరగతి విద్యార్థులు మొదటి సారి ఓటు వేసినప్పటికీ చెల్లె ఓట్లు వేయడం అభినందించ దగిన విషయం. నిజమైన ఎన్నికలు తలపించే విధంగా విద్యార్థులు ప్రిసైడింగ్ అధికారులు, పోలీస్ సిబ్బంది మెడికల్ సిబ్బంది, వివిధ శాఖల అవలంబిస్తున్న డ్రెస్ కోడ్ తూచా తప్పకుండా పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావ్, ఎంపీడీఓ శేఖర్, గ్రామస్తులు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దేవన్న, ఉపాధ్యాయులు, రాజేందర్, శ్రీనివాస్, చంద్రమ్మ, వినోద్ రెడ్డి, వెంకటేశ్వర్, మురళీధర్, రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముధోల్ పోలీసులు సేవలు అభినందనీయం

నవతెలంగాణ-ముధోల్

ముధోల్‌లో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి ముధోల్ పోలీసుల సేవలు అభినందనీయమని ముధోల్ హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రోళ్ల రమేష్ అన్నారు. ముధోల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్‌లను హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు మా వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని వారు పేర్కొన్నారు. రాబోయే దసర నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుటకు కృషి చేస్తామని వారు చెప్పారు. అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు రోళ్ల రమేష్, గౌరవాధ్యక్షుడు ధర్మపురి సుదర్శన్, ఉపాధ్యక్షుడు జీవన్, తాటివార్ రమేష్, సంయుక్త కార్యదర్శి దేవోజీ భూమేష్, మోహన్ యాదవ్, వీడీసీ అధ్యక్షుడు గుంజుల నారాయణ, కోశాధికారి సాయినాథ్, సభ్యులు జంబుల సాయిప్రసాద్ యాదవ్, భాస్కర్, రాంకీ పాల్గొన్నారు.

శాస్త్రీయంగా ఆధ్యయనం చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ఇథనాల్ పరిశ్రమ వలన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇథనాల్ పరిశ్రమపై అధికారులు, పరిశ్రమ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ వలన రైతులకు, పర్యావరణానికి సమస్యలు తలెత్తకుండా శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలితో సహా సంబంధిత శాఖల నియమాలను పరిశ్రమ యాజమాన్యం కచ్చితంగా పాటించాలన్నారు. పరిశ్రమ వలన రైతులు, ప్రజలకు ఎటువంటి నష్టాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశ్రమ నిర్వహణను వివరించారు. పరిశ్రమ స్థాపనకు అయ్యే మొత్తం ఖర్చులో 25 శాతం సున్నా శాతం ఉద్గారాలకు సంబంధించిన అధునాతన సాంకేతికతపై ఖర్చు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. ఇథనాల్ పరిశ్రమపై రైతులు, ప్రజలు ఎటువంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే గ్రామస్తులు, రైతులతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, భూగర్భ జలశాఖ అధికారి శ్రీనివాస్‌బాబు, డీఎంహెచ్‌ఓ రాజేందర్, ఆర్ అండ్ బి ఈఈ అశోక్, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీఓ అరుణారాణి, అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



- కలెక్టర్ ఫిర్యాదు చేస్తాం
- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అధికార దాహంతో స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ నగేష్‌తో పాటు మున్సిపల్ అధికారులు, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ లేకుండా అధికార కార్యక్రమాలు నిర్వహించడం కొబ్బరికాయలు కొట్టి ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడటం జరుగుతుందని, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు అజయ్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.322 కోట్ల నిధులను మాజీ మంత్రి కృషితో పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి మంజూరు చేసుకోగా, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ నగేష్ హడావిడిగా అభివృద్ధి కార్యక్రమాలకు, కొబ్బరికాయలు కొట్టడం హాస్యస్పదంగా ఉందన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన పాయల శంకర్‌కు అనుభవం లేకపోవచ్చు. స్థానిక ఎంపీ నగేష్ మాజీ మంత్రిగా గత ఎమ్మెల్యేగా అనుభవం ఉండి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు వెనుగంటి ప్రకాష్, దమ్మ పాల్, మోబిన్, సృజన్ హైమద్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రేడ్ వన్ మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడిని శాశ్వతంగా దూరం చేసేలా కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని తీసుకువచ్చిందని, అందులో భాగంగా ఆదిలాబాద్ ఎంపిక కాగా రూ.320కోట్లు ఇచ్చిందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. అమృత్ పథకం కింద మంజూరైన నిధులతో కేఆర్‌కే కాలనీలో 16 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించే వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే పాయల శంకర్ తో కలిసి ప్రారంభించారు. కాలనీకి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలను మహిళలు తిలకం దిద్ది స్వాగతం పలికారు. అనంతరం పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రెండు లక్షల పైచిలుకు జనాభా ఉన్న ఆదిలాబాద్ గ్రేడ్ వన్ మున్సిపల్ నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం సమస్యల లేకుండా అమృత్ పథకంలో నిధులను కేటాయించిందని తెలిపారు. వచ్చిన రూ.320 కోట్లతో నీటి సమస్యతో పాటు మురుగు కాలువలు, రోడ్ల నిర్మాణాలను చేపడుతామని తెలిపారు. పట్టణ ప్రజల దాహార్తిని శాశ్వతంగా దూరం చేయడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు. అనేక సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాటర్ ట్యాంక్ నిర్మాణంతో విముక్తి కలుగుతుందన్నారు. సమయానుగుణంగా నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేయాలని ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఈఈ గంగాధర్, నాయకులు అశోక్‌రెడ్డి, సాయి, రాము, స్వప్న, సురేఖ, నాందేవ్, రాజు, స్వప్నిల్ పాల్గొన్నారు.



ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఉట్నూర్‌లోని కుమురంభీం భవన సముదాయంలోని ఆడిటోరియంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు రాజర్షిషా, వెంకటేష్ ధోత్రే, ఐజీ, ఎస్పీలు గౌష్ ఆలం, డి.వి.శ్రీనివాసరావు, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ తివారి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మడి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రాజ్ గోండ్ రాయి సెంటర్ జిల్లా అధ్యక్షుడు దుర్గుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్‌ల ప్రతినిధులు, సార్మేడీలు, పటేళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రాయిసెంటర్ అనేది రాయిసెంటర్ వ్యవస్థకు పునాది లాంటిదని, గ్రామస్థాయిలో తీసుకున్న నిర్ణయాలను రాయిసెంటర్ ద్వారా అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ రాయిసెంటర్ అభిప్రాయాలను ప్రాధాన్యతగా తీసుకొని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అన్నారు. ఆదివాసి ప్రాంతాలలోని సమస్యలను పరిష్కరించుకొని ప్రాంతాలను అభివృద్ధి చేసుకొని భావితరాలకు మంచి వ్యవస్థ అందించేందుకు తాతలు, అంతకు ముందు తరంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, గొప్ప నిర్ణయాలు తీసుకొని, గొప్ప పథకాలు తెచ్చుకోవడం జరిగిందని తెలిపారు. ఈనాడు అమలవుతున్న చట్టాలు ఆనాటి పెద్దల అభిప్రాయాలు, పోరాటాలు, నిర్ణయాల ఫలితమేనని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను పదవి చేపట్టిన తర్వాత వచ్చారని, జిల్లాలోని ప్రాజెక్టులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలుతో పాటు ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఆదివాసుల అభివృద్ధికి మద్దతునిస్తూ, సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటామని తెలిపారు. అన్ని ఆదివాసీ సంఘాలతో నిర్వహించే సమావేశం కంటే ముందే గోండ్వానా సమితి, రాయిసెంటర్ ప్రతినిధులకు గౌరవం ఇస్తూ ముందుగా ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేస్తుందని, మన ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటూ భావితరాల భవిష్యత్తు బంగారు బాటలు వేయాలని, కుల, మత, వర్గ విభేదాలు లేకుండా జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-బోథ్

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి వేడుకలను శనివారం బోథ్ మండల కేంద్రంతో పాటు ధన్నూర్‌లో నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ధన్నూర్(బి) గ్రామంలోని కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేక ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాలు చేసి తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి, బీసీల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు రంగారెడ్డి, బోథ్ పట్టణాధ్యక్షుడు మొరుగు భోజన్న, మండలాధ్యక్షుడు అసాల సదాశివ్,మ ప్రధాన కార్యదర్శి మాసం అనిల్, గౌరవాధ్యక్షులు గంగుల మల్లేష్, నాయకులు సంతోష్, శంకర్, నారాయణ, ఎర్రన్న, రాజన్న పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడి కుటుంబ సభ్యులు, మరికొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని దానిని మానుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ అన్నారు. శనివారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులు శాంతియుతంగా ఉండాలని ఎప్పుడు కోరుకునేవారని అన్నారు. రాథోడ్ వారసునిగా ఆయన ఆశయాలను, తూచ తప్పకుండా ముందుకు తీసుకెళుతానని అన్నారు. లవ్ జిహాద్, లాండ్ జిహాద్‌పై మాత్రమే గవర్నర్‌కి ఫిర్యాదు చేశామని తప్పుడు ప్రచారాన్ని మైనార్టీలు మానుకోవాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో త్వరలో గవర్నర్ పర్యటించి, శాంతియుత వాతావరణం నెలకొల్పేలా చూస్తానని హామీ ఇచ్చారు.